క్లుప్తంగా

మహిళలు అన్ని రంగాలలో రాణించాలి



జ్యోతి వెలిగించి చర్చ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్

చిక్కడపల్లి: మహిళలు అన్ని రంగాలలో రాణించినప్పుడే దేశం మరింత అభివృద్ధి చెందుతుందని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. బుధవారం చిక్కడపల్లిలోని బ్రహ్మకుమారీస్ కేంద్రంలో 'కుటుంబం, సమాజంలో శాంతి సామరస్యాన్ని నెలకొల్పడంలో మహిళల పాత్ర' అనే అంశంపై చర్చ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. శాంతి, సామరస్యాన్ని నెలకొల్పడంలో మహిళల పాత్ర చాలా కీలకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు ముఠా నరేష్, చిక్కడపల్లి బ్రహ్మకుమారీస్ కేంద్రం ఇన్‌చార్జి జయశ్రీ, ప్రతినిధులు రశ్మిత, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్కలు నాటుతున్న కార్పొరేటర్ రచనశ్రీ

కవాడిగూడ: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని కవాడిగూడ కార్పొరేటర్ జి.రచనశ్రీ అన్నారు. బుధవారం ఏవీ కాలేజ్, ద్వారకా హైస్కూల్ తదితర ప్రాంతాలలో రోడ్లపై పేరుకుపోయిన మట్టి, చెత్తకుప్పలను తొలగించి చెట్లను నాటారు. స్థానికుల ఫిర్యాదు మేరకు కవాడిగూడలోని పలు ప్రాంతాలలో జీహెచ్‌ఎంసీ సిబ్బందితో కలిసి చెత్త కుప్పలను తొలగించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ రచనశ్రీ మాట్లాడుతూ... నగరంలో రోజురోజుకు కాలుష్యం పెరిగిపోతుందని అన్నారు. కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోరారు.

ప్రణాళికాబద్ధంగా పరీక్షలకు సిద్ధం కావాలి



ముషీరాబాద్: ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ ప్రణాళికాబద్ధంగా విద్యార్థులు పరీక్షలకు సిద్ధం కావాలని జిల్లా విద్యాశాఖ అధికారిణి రోహిణి సూచించారు. ముషీరాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు పరీక్షలపై పలు సూచనలు చేశారు. చదువుపైనే మనస్సును నిమగ్నం చేయాలన్నారు. ఇష్టమైన సబ్జెక్టులను బాగా చదివి క్లిష్టమైన సబ్జెక్టులకు సైతం ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఒత్తిడికి గురి కాకుండా వంద శాతం మార్కులు సాధించే విధంగా చదువుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ విద్యామండలి డిప్యూటీ ఈవో శ్రావణ్‌కుమార్, డిప్యూటీ ఐవోఎస్ జేఎల్ స్వరూపారాణి, అధ్యాపకులు నరేందర్‌యాదవ్, రత్నం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్ల సముదాయంలో సౌకర్యాలు కల్పించండి

ముషీరాబాద్: నియోజకవర్గానికి చెందిన 1500 మంది లబ్ధిదారులకు శామీర్‌పేట మండలం మురహరిపల్లిలో ఇచ్చిన డబుల్ బెడ్‌రూమ్ సముదాయంలో కనీస సౌకర్యాలు కల్పించాలని మురహరిపల్లి డబుల్‌బెడ్‌రూమ్ అసోసియేషన్ నాయకులు కోరారు. ఈ మేరకు మాజీ మంత్రి మల్లారెడ్డికి బుధవారం లబ్ధిదారులు వినతిపత్రం అందజేశారు. 2023 ఆగస్టు 24వ తేదీన తమకు డబుల్ బెడ్‌రూమ్‌లు మంజూరు చేసి పట్టాలు ఇచ్చారని తెలిపారు. కానీ అందులో మంచినీటి సౌకర్యం లేదని, లిఫ్ట్ పని చేయడం లేదని తెలిపారు.

కల్యాణం.. కమనీయం

ముషీరాబాద్: అడిక్‌మెట్ డివిజన్ విద్యానగర్ అచ్చుతరెడ్డి మార్గ్‌లోని బ్రహ్మంగారి గుడిలో సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం బుధవారం కనులపండుగగా జరిగింది. కల్యాణానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ముఠా గోపాల్, ముఠా జైసింహ హాజరై కల్యాణ మహోత్సవాన్ని వీక్షించారు.

ప్రయాణికుడి ల్యాప్‌టాప్ చోరీ

కాచిగూడ: రైలులో ప్రయాణిస్తున్న ఓ వ్యక్తి ల్యాప్‌టాప్ చోరీకి గురైన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... మహారాష్ట్ర అమరావతికి చెందిన సరోష్ సలావుద్దీన్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. బుధవారం కాచిగూడ రైల్వే స్టేషన్‌లో ప్లాట్‌ఫారం నం.1పై తిరుపతి – అమరావతి ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కాడు. చూసుకునే సరికి ల్యాప్‌టాప్ బ్యాగు కనిపించలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్విమ్మింగ్ నిల్..!



- జాతీయస్థాయి ప్రమాణాలు ఉన్నా స్విమ్మింగ్‌పూల్ నిర్వహణ సున్న
- మార్చి ప్రారంభమైనా తెరుచుకోని అంబర్‌పేట పోలీస్‌లైన్ స్విమ్మింగ్‌పూల్
- వచ్చే కాస్త ఆదాయం వేసవిలోనే ఆయినా కళ్లు తెరవని అధికార యంత్రాంగం

అంబర్‌పేట: ప్రతి ఏడాది ఫిబ్రవరి మొదటివారంలో అందుబాటులోకి రావాల్సిన అంబర్‌పేట జీహెచ్‌ఎంసీ స్విమ్మింగ్ పూల్ మార్చి నెల మొదలైనా అందుబాటులోకి రాని పరిస్థితి నెలకొంది. జాతీయస్థాయి ప్రమాణాలు ఉన్నా స్విమ్మింగ్‌పూల్ నిర్వహణను జీహెచ్‌ఎంసీ అధికారులు గాలికొదిలేశారు. ప్రతి ఏడాది డిసెంబర్, జనవరిలో స్విమ్మింగ్ పూల్‌ను చలి కారణంగా మూసేస్తారు. తిరిగి ఫిబ్రవరిలో ప్రారంభించాల్సి ఉంటుంది. కానీ అంబర్‌పేటలోని స్విమ్మింగ్‌పూల్‌ను మార్చి అయినా అందుబాటులోకి తీసుకురాకపోవడం గమనార్హం.

ఆదాయం కోల్పోతున్న వైనం...

అంబర్‌పేట పోలీస్ లైన్‌లో ఉన్న జీహెచ్‌ఎంసీ స్విమ్మింగ్‌పూల్ ప్రాంగణంలో చిన్నారులు, పెద్దలకు చెరో స్విమ్మింగ్‌పూల్ ఉంది. ఇక్కడ స్విమ్మింగ్ చేయాలంటే నెలకు రూ.500 రుసుం చెల్లించాల్సి ఉంటుంది. స్విమ్మింగ్‌పూల్‌కు వచ్చే ఆదాయం వేసవిలోనే. కానీ మార్చి మొదలైనా తెరుచుకోకపోవడంతో ఆ వచ్చే ఆదాయం సైతం కోల్పోనుంది. ఈ స్విమ్మింగ్‌పూల్‌లో ఎంతో మంది శిక్షణ పొంది జాతీయ స్థాయిలో రాణిస్తున్నారు. సకాలంలో స్విమ్మింగ్‌పూల్ తెరుచుకోక పోవడంతో క్రీడాకారులతో పాటు స్విమ్మింగ్ ప్రియులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. ఇప్పటికైనా స్విమ్మింగ్‌పూల్ ప్రారంభించేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఈనెల చివరి నాటికి...

అంబర్‌పేటలో ఉన్న జీహెచ్‌ఎంసీ స్విమ్మింగ్‌పూల్ త్వరగా అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటాం. క్రీడా విభాగం అధికారులు సూచనలు చేసి యుద్ధ ప్రాతిపదికన ప్రారంభానికి పనులు నిర్వహించేలా కృషి చేస్తాను. ఈనెల చివరి నాటికి ప్రారంభించేందుకు చొరవ తీసుకుంటాను.

– మారుతీదివాకర్, సర్కిల్–16 డీఎంసీ

గొప్ప సంఘ సంస్కర్త సంత్ సేవాలాల్ మహారాజ్

ఘనంగా సంత్ సేవాలాల్ జయంతి ముగింపు వేడుకలు



వేడుకల్లో ఎమ్మెల్యే ముఠాగోపాల్, రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె.లక్ష్మణ్, అనిల్‌కుమార్ యాదవ్

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: గొప్ప సంఘ సంస్కర్త సంత్ సేవాలాల్ మహారాజ్ అని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్‌ను స్మరించుకోవడం గర్వకారణమని అన్నారు. బుధవారం బాగ్‌లింగంపల్లిలోని లంబాడి తండాలో సేవాలాల్ సేనా నగర అధ్యక్షుడు కళ్యాణ్‌నాయక్ ఆధ్వర్యంలో సంత్ సేవాలాల్ జయంతి వేడుకల ముగింపు సభను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంత్‌సేవాలాల్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ముఠాగోపాల్ మాట్లాడుతూ... సంత్ సేవాలాల్ మహారాజ్ గిరిజనులతో పాటు సమాజంలోని అందరికీ తన బోధనలతో చైతన్య పరిచారన్నారు. సేవాలాల్ జయంతి వేడుకలను బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2014 నుంచి అధికారికంగా నిర్వహిస్తోందని అన్నారు.

అందరికీ ఆదర్శ ప్రాయుడు సేవాలాల్..

రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ మాట్లాడుతూ... సేవాలాల్ మహారాజ్ చూపిన మార్గం ఆచరణీయమని అన్నారు. సేవాలాల్ అందరికీ ఆదర్శ ప్రాయుడని కొనియాడారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్‌కుమార్ యాదవ్, బీఆర్‌ఎస్ నాయకులు ముఠా జైసింహ, సేవాలాల్ సేనా వ్యవస్థాపక అధ్యక్షుడు భూక్యా సంజీవ నాయక్, హౌస్ ఫెడ్ డైరెక్టర్ అయిలినేని కిషన్‌రావు, ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ రాందాస్ తేజావత్, చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ రాజునాయక్, ఓభా నాయక్, దేవేందర్, నెహ్రూనాయక్, ముచ్చకుర్తి ప్రభాకర్, అంబటి శ్రీనివాస్‌రెడ్డి, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

యూనిక్ డిజేబిలిటీ ఐడీకార్డుల జారీపై హర్షం



హర్షం వ్యక్తం చేస్తున్న డవలప్‌మెంట్ సొసైటీ ఫర్ ద డెఫ్ జాతీయ కన్వీనర్ వల్లభనేని ప్రసాద్

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: కేంద్ర ప్రభుత్వం 'యూనిక్ డిజేబిలిటీ ఐడీ'కార్డుల(యూడీఐడీ) జారీ పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నట్లు డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ ద డెఫ్ జాతీయ కన్వీనర్ వల్లభనేని ప్రసాద్, ఉపాధ్యక్షుడు కాటమోని వెంకటేష్‌గౌడ్ పేర్కొన్నారు. బుధవారం బాగ్‌లింగంపల్లిలో వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం 2016లో దివ్యాంగులకు యూడీ, ఐడీ కార్డులను జారీ చేసిందన్నారు. ఇప్పటి వరకు మళ్లీ కార్డులు జారీ చేయకపోవడంతో జనవరి 29న ఢిల్లీలోని కేంద్ర దివ్యాంగుల సాధికారత శాఖ కార్యదర్శి డాక్టర్ రాజేష్ అగర్వాల్‌కు వినతి పత్రం సమర్పించామని తెలిపారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఫిబ్రవరి 18వ తేదీ అన్ని రాష్ట్రాలలో యూడీ, ఐడీ కార్డులను జారీ చేసిందన్నారు. కార్డుల జారీపై శ్రద్ధ తీసుకున్న డాక్టర్ రాజేష్ అగర్వాల్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అంతేకాకుండా దివ్యాంగులకు అన్ని సంక్షేమ పథకాలు, రాయితీలను అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఇమ్రాన్, ప్రేమ్‌కుమార్, అంతగిరి, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలి మహాసభలను విజయవంతం చేయండి



పద్మశాలి మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వనం దుశ్యంతల, గుంటక రూపా, పోరండ్ల శారద

కాచిగూడ: మార్చి 9న నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో నిర్వహిస్తున్న పద్మశాలి మహాసభలను జయప్రదం చేయాలని అఖిల భారత పద్మశాలి సంఘం మహిళా విభాగం జాతీయ అధ్యక్షురాలు వనం దుశ్యంతల పిలుపునిచ్చారు. బుధవారం నారాయణగూడలోని పద్మశాలి భవన్‌లో తెలంగాణ మహిళా అధ్యక్షురాలు గుంటక రూపా, గ్రేటర్ హైదరాబాద్ మహిళా అధ్యక్షురాలు పోరండ్ల శారదతో కలిసి ఆమె మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. 17వ అఖిల భారత పద్మశాలి మహాసభలు, 8వ తెలంగాణ ప్రాంత పద్మశాలి మహాసభల్లో మహిళలు వేలాదిగా పాల్గొని పద్మశాలీల ఐక్యతను చాటాలని కోరారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించినప్పుడే పద్మశాలీల అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. కార్యక్రమంలో పద్మశాలి మహిళా ప్రతినిధులు చిలువేరు సునిత, బాసాని పద్మ, లక్ష్మి, శోభ, స్రవంతి, చిన్నకోట్ల స్వప్నరాజ్, ఎం.శశికళ, నోముల రేఖ, పేరాల సుజాత తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్‌కు చెందిన బీజేపీ యువ నాయకుడు దోనేటి సత్యంను మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ బుధవారం పరామర్శించారు. ఆర్టీసీ క్రాస్‌రోడ్డు జవహర్‌నగర్‌లోని సత్యం నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముచ్చకుర్తి ప్రభాకర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చేనేత సమస్యల పరిష్కారానికి ఐక్య ఉద్యమాలే శరణ్యం



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ చిక్కా దేవదాసు, బాలరాజ్, చంద్రశేఖర్

చిక్కడపల్లి: చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఐక్య ఉద్యమాలే శరణ్యమని చేనేత వర్గాల చైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చిక్కా దేవదాసు అన్నారు. బుధవారం చిక్కడపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పద్మశాలి మహాసభల పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈనెల 9వ తేదీన నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నిర్వహించే అఖిలభారత పద్మశాలి సంఘం 17వ మహాసభ, తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం ఎనిమిదో మహాసభలను జయప్రదం చేయాలన్నారు. ఈ సందర్భంగా చిక్కాదేవదాసు మాట్లాడుతూ... రాష్ట్రంలో పద్మశాలీలు 12 శాతం ఉన్నారని అన్నారు. 'మేమెంతో మాకు అంతా..' అనే నినాదంతో పద్మశాలీల డిమాండ్లను సాధించుకోవాలన్నారు. ఈ మహాసభలు పద్మశాలీల ఉజ్వల భవిష్యత్‌కు ఎంతో దోహదపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్.బాలరాజ్, టి.చంద్రశేఖర్, కె.సుదర్శన్‌రావు, శ్రీకాంత్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌యూఐ బలోపేతానికి కృషి చేస్తాం

ఎన్‌ఎస్‌యూఐ ప్రధానకార్యదర్శి శివరామకృష్ణరెడ్డి



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన శివరామకృష్ణరెడ్డి

కాచిగూడ: ఎన్‌ఎస్‌యూఐ బలోపేతానికి తన వంతుగా కృషి చేస్తానని ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధానకార్యదర్శి శివరామకృష్ణరెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన సందర్భంగా బుధవారం ఆయన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శివరామకృష్ణరెడ్డికి ముఖ్యమంత్రి అభినందనలు తెలిపారు. అనంతరం నారాయణగూడలో విలేకరుల సమావేశంలో శివరామకృష్ణరెడ్డి మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. అర్హులందరికీ పథకాలు అందేలా కృషి చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన ఎన్‌ఎస్‌యూఐ జాతీయ ఇన్‌చార్జి కన్హయ్య కుమార్, జాతీయ అధ్యక్షుడు వరుణ్ చౌదరి, రాష్ట్ర ఇన్‌చార్జ్ ప్రతీక్, ఫహద్, రాష్ట్ర అధ్యక్షుడు స్వామి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే రాజ్‌గోపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌లకు కృతజ్ఞతలు తెలియజేశారు.

అగ్నిప్రమాదంలో వృద్ధురాలిని కాపాడిన యువకుడు

- అస్వస్థతకు గురైన వృద్ధురాలు
- స్వల్ప గాయాలతో బయటపడ్డ రాజు



చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్ దప్పు ఎల్లయ్యబస్తీలోని ఓ ఇంట్లో బుధవారం తెల్లవారుజామున అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఆ సమయంలో అమీనా (60) ఒక్కరే ఇంట్లో ఉన్నారు. దట్టమైన పొగలు రావడాన్ని గమనించిన రాజు వృద్ధురాలిని బయటకు తీసుకొచ్చాడు. పొగ కారణంగా ఆమె అస్వస్థతకు గురైంది. ఈ క్రమంలో రాజుకు సైతం స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే వారిని సమీపంలోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న ఫైరింజన్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్ ఆదేశాల మేరకు బీఆర్‌ఎస్ సీనియర్ నేత ముఠానరేష్, కుమారస్వామి సంఘటన స్థలాన్ని సందర్శించి బాధితులకు అండగా ఉంటామన్నారు.

లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా పోరాడాలి



చిక్కడపల్లిలోని లేబర్ అడ్డా వద్ద కూలీలతో మాట్లాడుతున్న మహేందర్

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: కార్మికులను బానిసలుగా మార్చే లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా పోరాడాలని ముషీరాబాద్ జోన్ సీఐటీయూ కార్యదర్శి మహేందర్ పిలుపునిచ్చారు. బుధవారం చిక్కడపల్లిలోని లేబర్ అడ్డా వద్దా కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ... వేసవి కాలం వస్తున్నందున అడ్డమీది కూలీలకు మంచినీటి సౌకర్యం కల్పించాలని అన్నారు. కార్మికులకు పనిలేక ఉదయం నుంచి సాయంత్రం వరకు ఈ అడ్డామీదనే నిరీక్షణ చేసే పరిస్థితి ఉందన్నారు. పట్టణ ఉపాధి హామీ పథకాన్ని కల్పించి సంవత్సరానికి 200 రోజులు పని కల్పించాలని కోరారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వెంకటయ్య, కార్యదర్శిగా అంజయ్య, ఉపాధ్యక్షులుగా దానయ్య, రాములు, కురుమయ్య, మల్లయ్య, సహాయ కార్యదర్శులుగా రమేష్, బంగారయ్య, నాగేందర్‌తో పాటు 21 మందిని ఎన్నుకున్నారు.

మహిళల రక్షణ, సాధికారతకు పోరాడతాం

- ఆమ్ ఆద్మీ పార్టీ మహిళా విభాగం
- మహిళా దినోత్సవం వేడుకలను 8న ఘనంగా నిర్వహిస్తాం



కవాడిగూడ: మహిళల రక్షణ, సాధికారత, సమానత్వం కోసం ఆమ్ ఆద్మీ పార్టీ ఆధ్వర్యంలో పోరాడుతామని ఆప్ మహిళా విభాగం నేతలు యమునా గౌడ్, సుధారాణి, డాక్టర్ లక్ష్మీనాయుడు, గాజుల మౌనిక పేర్కొన్నారు. బుధవారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మహిళలపై రోజు రోజుకు దాడులు అసమానతలు, అత్యాచారాలు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. 'బేటీ పడావో.. బేటీ బచావో..' అనే నినాదం కనీసం బీజేపీ పాలిత రాష్ట్రాలలో కూడా అమలు కావడంలేదని ఆరోపించారు. మహిళలు రాజకీయాలు, చదువు ఇలా అన్ని రంగాలలో సాధికారత సాధించేందుకు ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. లింగ సమానత్వంపై అవగాహన కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు.

భగత్‌సింగ్ గుడిసెవాసులకు ఇళ్లను కేటాయించాలి



భగత్‌సింగ్‌నగర్ గుడిసెవాసులను సమస్యలను అడిగి తెలుసుకుంటున్న సీపీఎం నాయకులు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: రాంనగర్ డివిజన్ బాగ్‌లింగంపల్లిలోని భగత్‌సింగ్ గుడిసెవాసులకు ఇందిరమ్మ ఇళ్లను కేటాయించాలని సీపీఎం గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కార్యదర్శి వెంకటేష్ డిమాండ్ చేశారు. బుధవారం సీపీఎం ముషీరాబాద్ జోన్ కమిటీ ఆధ్వర్యంలో భగత్‌సింగ్‌నగర్ బస్తీలో పర్యటించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ... 30 సంవత్సరాలుగా గుడిసెలు వేసుకుని జీవిస్తున్న పేదలకు ఇందిరమ్మ ఇళ్లను కేటాయించకపోవడం బాధాకరమని అన్నారు. గతంలోనే భగత్‌సింగ్ నగర్ గుడిసెవాసులకు సర్వే కూడా నిర్వహించారని తెలిపారు. గత ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కట్టిస్తామని హామీ ఇచ్చి మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా గుడిసెవాసులకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని కోరారు. బస్తీలో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందని అదేవిధంగా తాగునీటి సదుపాయం సరిగా లేదని తెలిఆపరు. ఈ కార్యక్రమంలో పార్టీ నగర కార్యదర్శి వర్గ సభ్యులు దశరథ్, ముషీరాబాద్ జోన్ కార్యదర్శి వెంకటేష్, రమేష్, పాషా, మహేందర్, మల్లయ్య, లెనిన్, సంగీత, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



బీజేపీ నగర కార్యాలయంలో మాట్లాడుతున్న సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్‌రెడ్డి

కాచిగూడ: జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పార్టీ కార్యకర్తలు, నేతలు అందరూ ఐక్యతతో పనిచేయాలని హైదరాబాద్ సెంట్రల్ జిల్లా పార్టీ అధ్యక్షుడు లంకల దీపక్‌రెడ్డి సూచించారు. బూత్‌స్థాయి నుంచి పార్టీని మరింత పటిష్టం చేయాలన్నారు. బుధవారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో అంబర్‌పేట, జూబ్లీహిల్స్, నాంపల్లి, ఖైరతాబాద్ నియోజకవర్గాల నేతలతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో ప్రధాని నరేంద్రమోదీ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృత స్థాయిలో తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు వై.అమృత, ఉమారాణి, నాయకులు డాక్టర్ ఎస్.గౌతంరావు, బంగారు శృతి, కన్నె రమేష్ యాదవ్, ప్రేమ్‌సింగ్‌రాథోడ్, కేశపాగా రాములు, ఎస్వీ సుభాష్, టి.రాజశేఖర్‌రెడ్డి, ఎడెల్లి అజయ్‌కుమార్, సి.కృష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మేయర్ పీఠం బీజేపీ కైవసం చేసుకోవడం ఖాయం



పార్టీ డివిజన్ అధ్యక్షులు, కార్యకర్తలతో జిల్లా పార్టీ అధ్యక్షుడు భారత్‌గౌడ్, కార్పొరేటర్ పావని

చిక్కడపల్లి: జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో బీజేపీ మేయర్ పీఠాన్ని కైవసం చేసుకోవడం ఖాయమని సికింద్రాబాద్ మహంకాళి జిల్లా పార్టీ అధ్యక్షుడు గుండగోని భారత్‌గౌడ్ ఆశాభావం వ్యక్తం చేశారు. బుధవారం జవహర్‌నగర్‌లో కార్పొరేటర్ పావనితో పార్టీ కార్యకలాపాలపై చర్చించారు. పార్టీని మరింత బలోపేతం చేయడానికి నేతలు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలన్నారు. ఇంటింటికీ తిరుగుతూ కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ పార్లమెంట్ పార్టీ జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు నవీన్‌కుమార్, నేతలు రత్నసాయిచంద్, టి.గోపాల్, శ్రీకాంత్, వీఎస్టీ రాజు, నర్సింగరావు, సాయికుమార్, హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ మొదటి పరీక్ష

- పరీక్షా కేంద్రాల వద్ద రోడ్డుకిరువైపులా వాహనాల పార్కింగ్
- ట్రాఫిక్ జామ్‌తో వాహనదారులకు తప్పని ఇబ్బందులు
- పరీక్షలు ముగిసే వరకు ట్రాఫిక్ జామ్ కాకుండా చూడాలంటున్న వాహనదారులు
- నేడు ఇంటర్ సెకండియర్ మొదటి పరీక్ష



నల్లకుంట ప్రధాన రహదారిలోని సెయింట్ ప్యాట్రిక్స్ కళాశాలలో పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

నల్లకుంట: అంబర్‌పేట నియోజకవర్గంలో బుధవారం ఇంటర్ మొదటి సంవత్సర పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పరీక్ష ఉదయం 9గంటలకు ప్రారంభం కాగా విద్యార్థులు 8.35 గంటల నుంచే పరీక్ష కేంద్రాలకు చేరుకోవడం కనిపించింది. గతంలో పరీక్ష కేంద్రాలు ఎక్కడ ఉన్నాయో తెలుసుకునేందుకు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కాగా ఈ ఏడాది పరీక్ష కేంద్రాలు ఎక్కడ ఉన్నాయో సులువుగా తెలుసుకునేందుకై విద్యార్థుల హాల్ టికెట్లపై క్యూఆర్ కోడ్ ఉండటంతో సెంటర్ల చిరునామా తెలుసుకోవడం సులభమైందని పలువురు పేర్కొన్నారు.

- నల్లకుంట పోలీస్ స్టేషన్ పరిధిలో ఆరు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. కొందరు విద్యార్థులు రెండు, మూడు నిమిషాలు ఆలస్యంగా వచ్చారు. అయినా విద్యార్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించారు. పరీక్ష కేంద్రాల్లో ఇన్విజిలేటర్లు, ఫ్లైయింగ్ స్క్వాడ్స్ పరీక్షల నిర్వహణను పర్యవేక్షించారు. ఎక్కడ కూడా మాస్ కాపీయింగ్ జరుగకుండా చర్యలు తీసుకున్నారు.

పరీక్ష కేంద్రాల వద్ద ఫుల్ ట్రాఫిక్ జామ్ ..

నల్లకుంట శంకరమఠం ప్రధాన రహదారిలో ఉన్న సెయింట్ ప్యాట్రిక్స్ జూనియర్ డిగ్రీ కళాశాల, చైతన్య కళాశాల, హిందీ మహావిద్యాలయ పరీక్ష కేంద్రాలు ఉన్నాయి. అలాగే శివం రోడ్డు లేబర్ అడ్డా సమీపంలో అల్ఫోర్స్ జూనియర్ కళాశాలల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. కాగా ఆయా సెంటర్ల వద్ద సరైన వాహన పార్కింగ్ లేకపోవడంతో విద్యార్థులను పరీక్ష కేంద్రాలు తీసుకొచ్చిన వాళ్లు తమ వాహనాలను రోడ్డుకిరువైపుల నిలిపారు. అసలే ఇరుకైన రహదారులు కావడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి. పరీక్షా కేంద్రాల వద్ద వాహనాలు నిలిచిపోవడంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. అలాగే నల్లకుంట ప్రధాన రహదారిలో ఉన్న ఎస్‌బీఐ చౌరస్తా వద్ద ట్రాఫిక్ పోలీసులు లేని కారణంగా వాహనదారులు ఇష్టారీతిన ప్రయాణం సాగిస్తుంటారు. పరీక్షల వేళ ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాల్సిన ట్రాఫిక్ పోలీసులు అటు వైపు కన్నెత్తి కూడా చూడలేదు. ఇప్పటికైనా లాఅండ్ఆడర్, ట్రాఫిక్ పోలీసు ఉన్నతాధికారులు స్పందించి ప్రధాన రహదారుల్లో వాహనాలు నిలపకుండా చర్యలు తీసుకొని చూడాలని పలువురు కోరుతున్నారు.

మొదటి పరీక్షకు 596 మంది హాజరు..

ముషీరాబాద్: ఇంటర్ మీడియట్ మొదటి సంవత్సరం పరీక్ష బుధవారం ముషీరాబాద్‌లో ప్రశాంతంగా జరిగాయి. మొదటి రోజు పరీక్షలు ప్రారంభం కావడంతో గంట ముందే విద్యార్థులు వారి తల్లిదండ్రులు పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. ముషీరాబాద్ రాంనగర్ సెయింట్‌పాయిస్ జూనియర్ కాలేజీలో 611మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా యనుండగా 596 మంది హాజరయ్యారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించారు.